'మనూ'లో నేడు వర్క్‌షాప్

రాయదుర్గం: మనూలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్(ఎంసీజే) ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 'మొబైల్ అండ్ డేటా జర్నలిజమ్–ఎంబ్రేసింగ్ ఇన్నోవేషన్ ఇన్ మీడియా' అనే అంశంపై ఈ వర్క్‌షాప్ కొనసాగుతుంది. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షత వహిస్తారు. కార్యక్రమంలో భారత్ సమాచార్ యూపీ ఎడిటర్ ఇన్ చీఫ్ బ్రజేష్‌మిశ్రా, బీబీసీ హిందీ ఎడిటర్ నితిన్ శ్రీవాస్తవ, టీజీఎంఆర్‌ఈఐఎస్ అధ్యక్షుడు ఎండీ ఫహీమ్‌ఖురేషి , పలువురు ప్రొఫెసర్లు పాల్గొంటారు.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రం అందజేత


మంజూరు పత్రాన్ని బాధిత కుటుంబానికి అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌కు చెందిన మహమ్మద్ హుస్సేన్‌కు అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ రూ.1.50 లక్షలు మంజూరుపత్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అండగా సీఎం సహాయనిధి ఆర్థిక భరోసానిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, శోభన్, అల్లం మహేష్, మల్లయ్య, విమల, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

'టీహబ్'కు ల్యాబ్ టు ల్యాండ్ అగ్రిటెక్ సొల్యూషన్‌కు సంబంధం లేదు

'టీహబ్' సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు

రాయదుర్గం: టీ హబ్‌కు ల్యాబ్ టు ల్యాండ్ అగ్రిటెక్ సొల్యూషన్‌కు ఎలాంటి సంబంధం లేదని టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ల్యాబ్ టు ల్యాండ్ అగ్రిటెక్ సొల్యూషన్ సంస్థ టీహబ్‌లో కేవలం అద్దెకు మాత్రమే కొనసాగుతోందన్నారు. ఆ సంస్థ వ్యాపార కార్యకలాపాలు లేదా నిర్ణయాలు, ముఖ్యంగా ఆ సంస్థ లావాదేవీలపై టీహబ్‌కు ఎలాంటి ప్రమేయం లేదని తెలిపారు.

టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఇన్‌చార్జ్‌ల నియామకం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఇన్‌చార్జ్‌లను నియమించారు. శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఏసీపీగా పనిచేస్తున్న సాయిబాబకు బుధవారం సర్కిల్ ఏసీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అదే విధంగా సర్కిల్‌లోనే రోడ్డు విస్తరణ విధులు నిర్వహిస్తున్న టీపీఎస్ రవీందర్‌కు అదనపు బాధ్యతలు కేటాయించారు. ఇప్పటి వరకు సర్కిల్‌లో డిప్యూటీ సిటీ ప్లానర్‌గా పనిచేసిన మెహ్రా, సెక్షన్ ఆఫీసర్ రమేష్‌లో నెలరోజులుగా సెలవులో ఉండటంతో అదనపు బాధ్యతలు కేటాయించారు.

కార్మికుల లేబర్ అడ్డా మార్పు


ఆర్టీఏ కార్యాలయం పక్కన లింకురోడ్డు అడ్డాలో కార్మికులు

చందానగర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్‌చంద్రబోస్‌నగర్ వద్ద ఉన్న కార్మికుల లేబర్ అడ్డాను పక్కనే ఉన్న ఆర్టీఏ కార్యాలయం, నోవాటెల్ హోటల్ రోడ్డులోకి మార్చడమైనదని మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ తెలిపారు. హఫీజ్‌పేట్, గచ్చిబౌలి ప్రధాన రహదారిపై కూలీలు ఉంటున్న సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయని ,ఈ క్రమంలో కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయం పక్కన ఉన్న లింకు రోడ్డులోకి లేబర్ అడ్డా మారిందని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున కార్మికులందరు ప్రతి రోజు ఆ లింకురోడ్డులో లేబర్ అడ్డాలో ఉండాలన్నారు. ఈ మార్పును ప్రజలు గమనించాలని కోరారు.

విద్యార్థులకు దంత పరీక్షలు


విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న డా.శ్రీధర్‌రెడ్డి

చందానగర్: చందానగర్ గంగారంలోని ప్రభుత్వ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి దంత పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన దంతాల శుభ్రంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం లయన్స్ క్లబ్ సభ్యులు విద్యార్థులకు టూత్ పేస్ట్, బ్రష్‌లను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షులు కొండ విజయ్‌కుమార్, అధ్యక్షులు బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి సింగిరెడ్డి శాంతిభూషణ్‌రెడ్డి, ట్రెజరర్ రెడ్డి ప్రవీణ్‌రెడ్డి, సభ్యులు మహిపాల్‌రెడ్డి, మారం వెంకట్, మారం ప్రసాద్, సింగ దాసరి రాజశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్, ప్రీతి, కృష్ణవేణి, పద్మలత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉందాం..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పేద విద్యార్థులకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. బుధవారం భెల్ టౌన్‌షిప్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు తమవంతు కృషి చేయాలని కోరారు. తమ ట్రస్టు ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు తదితర సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

రామచంద్రాపురం పట్టణంలో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేక మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సభ్యత్వాలు తీసుకుంటున్నారని తెలిపారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు భూపాల్ రెడ్డి, రాజు, రాంబాబు, పెంటారెడ్డి, జైపాల్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి చూపే 'న్యాక్'



మాదాపూర్: నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్న సంగతి తెలిసిందే. కానీ ఈ అవకాశాలను అన్వేషించడానికి అవసరమైన నైపుణ్యాలను కలిగి ఉండాలి. ఈ నైపుణ్యాలకు సంబంధించిన శిక్షణ కోర్సులను మాదాపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అందిస్తోంది. ఐదవ తరగతి ఫెయిల్, ఇంజనీరింగ్ ఉత్తీర్ణత సాధించినవారి వరకు ఈ కోర్సులు అభ్యసించడానికి, ఉద్యోగాలు పొందేందుకు అర్హులు. న్యాక్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి చైర్మన్‌గా, రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

న్యాక్‌లో అందించే కోర్సులు

ప్లంబింగ్, పెయింటింగ్, వెల్డింగ్, మాసన్ (మేస్త్రీ), డ్రైవాల్, ఫాల్‌సీలింగ్, సూపర్‌వైజర్, స్టోర్‌కీపర్, ల్యాండ్ సర్వే, టోటల్ స్టేషన్‌లలో న్యాక్ శిక్షణ అందిస్తుంది. సివిల్ ఇంజనీరింగ్, ఇతర బ్రాంచ్‌ల కోర్సుల్లో 3 నెలలు, 6 నెలలు, సంవత్సర కాల పరిమితితో కూడి ఉన్నాయి. నిర్మాణ ప్రాజెక్టు నిర్వహణ, సర్వేయింగ్, కాంట్రాక్టు మేనేజ్‌మెంట్, ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ ప్రోగ్రాం, కన్‌స్ట్రక్షన్ సేఫ్టీ, ఫినిషింగ్ స్కూల్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లను కూడా అందిస్తోంది.



ఉచిత శిక్షణ..వసతి.. ప్లేస్‌మెంట్

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ, హాస్టల్ వసతితో ప్లేస్‌మెంట్ కూడా కల్పిస్తున్నారు. ఇతర వాటి కోసం న్యాక్ నామమాత్రపు రుసుము వసూలు చేస్తుంది

◆ ఇక్కడ శిక్షణ పూర్తి చేసిన తర్వాత స్కిల్ సెక్టార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించే స్కిల్ ఇండియా అసెస్‌మెంట్ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు భారత ప్రభుత్వం స్కిల్ సర్టిఫికెట్ అందిస్తుంది. ఎస్ఎస్‌సీఐ ద్వారా సర్టిఫికెట్ జారీ చేయడంతో ప్రముఖ కంపెనీలలో ఎక్కువగా ఉద్యోగావకాశాలను పొందవచ్చు.

◆ కోర్సులు చేయాలనుకున్న వారు, మరిన్ని వివరాలు తెలుసుకోవాలనేకునే వారు 9247440625, 7097114947, 8885193747 నంబర్‌లలో సంప్రదించవచ్చు.


నిర్మాణరంగ అంశాలపై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్న న్యాక్ సిబ్బంది

మంచి ఉద్యోగాలు పొందుతున్నారు



శిక్షణ ద్వారా నైపుణ్యాలను పెంపొందించుకోవడంతోపాటు ప్రముఖ కంపెనీలలో మంచి ఉద్యోగాలను సంపాదించుకోవచ్చు. యువతకు న్యాక్ అద్భుతమైన అవకాశాలను అందిస్తుంది. ముఖ్యంగా సివిల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల ప్రయోజనం కోసం న్యాక్ అంతర్జాతీయ స్థాయి నైపుణ్య పాఠ్యాంశాలను ప్రవేశపెట్టింది. గ్రాడ్యుయేట్లు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. – శాంతిశ్రీ, అడ్మిన్ డైరెక్టర్

పర్యావరణ పరిరక్షణ దిశగా..

'ప్రాజెక్ట్ గో కురిస్' పేరిట మంథన్ విద్యార్థుల ప్రత్యేక కార్యక్రమం


కాగితపు వ్యర్థాల రీసైక్లింగ్‌తో మంథన్ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన బొమ్మలు



రాయదుర్గం: పర్యావరణ పరిరక్షణ వైపు అడుగులు వేశారు మంథన్ పాఠశాల విద్యార్థులు. ఐఎస్బీ ఛేంజ్ మేకర్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా పాఠశాలలో 9వ తరగతి ఐజీసీఎస్‌ఏ విద్యార్థులు పేపర్ రీసైక్లింగ్, సస్టేనబిలిటీపై ప్రత్యేక దృష్టి సారించారు. పాఠశాలలోని కాగితపు వ్యర్థాలను తగ్గించడంలో భాగంగా రీసైకిల్ ద్వారా వస్తువులుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా బుధవారం గౌలిదొడ్డి కేశవనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం విరాళాల డ్రైవ్, వర్క్‌షాప్‌ను నిర్వహించారు. విద్యార్థులు కాగితపు వ్యర్థాలు సేకరించి వాటిని ముక్కలు చేసి గుజ్జుగా మార్చారు. ఆ గుజ్జు తర్వాత కాగితంగా మార్చి బొమ్మలు, శిల్పాలు, అలంకార వస్తువులు తయారు చేసి కేశవనగర్ పాఠశాల విద్యార్థులకు అందించారు. ఈ వర్క్‌షాప్‌లో పేపర్ రీసైక్లింగ్‌ను పిల్లలకు నేర్పించారు. అనంతరం మంథన్ స్కూల్ ప్రిన్సిపల్ సుర్జీత్‌సింగ్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ గో కురిస్ పేరిట ప్రత్యేక కార్యక్రమం మార్పును సృష్టిస్తుందనడంలో సందేహం లేదన్నారు.

పూర్తికాని పనులు.. నిత్యం ఇబ్బందులు

- ఏడాదిగా టీఎన్‌జీఓ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులు
- అవస్థలు పడుతున్న ప్రజలు... పట్టించుకోని అధికారులు



టీఎన్‌జీఓకాలనీలో గత ఏడాది వేసిన శిలాఫలకం ..

రాయదుర్గం: భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి కాకపోవడంతో గచ్చిబౌలిలోని టీఎన్‌జీఓ కాలనీవాసులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో ప్రభుత్వ ఉద్యోగులు నివాసముంటున్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో సెక్రటేరియట్ కాలనీ, టీఎన్‌జీఓ కాలనీఫేజ్–1, ఫేజ్–2లలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పైప్‌లైన్ ఏర్పాటు కోసం పనులను ప్రారంభించారు. ఏడాది దాటినా ఇప్పటి వరకు పూర్తి కాకపోవడంతో నిత్యం అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. దీనికితోడు స్థానికంగా ఏర్పాటు చేయతలపెట్టిన ఎస్టీపీ, చెరువు సుందరీకరణ పనులను కూడా చేయడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జలమండలి అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ


విద్యార్థులతో రాణిగంజ్ డిపో అధికారులు, రాయదుర్గం హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రాయదుర్గం: దివంగత గడప ఎల్లయ్య జ్ఞాపకార్థం గడప రమేష్ బుధవారం రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాణిగంజ్ డిపో మేనేజర్ ఏ శ్రీధర్ ఆధ్వర్యంలో ఉచిత బస్‌పాస్‌లను అందజేశారు. రెండు పాఠశాలలలోని 330 మంది విద్యార్థులకు బస్‌పాస్‌లను అందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఏ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి మార్కులు సాధిస్తేనే ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలకు సార్థకత చేకూరుతుందన్నారు. రవీందర్‌రెడ్డి, ఏడీసీ సుధాకర్‌రెడ్డి, ఏడీసీ మహ్మద్ గఫూర్, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఎస్‌కే తాజ్‌బాబు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీబాయి, రాణిగంజ్ డిపో అధికారులు ఎస్ ధర్మేందర్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వాచ్‌మెన్ మృతి

గచ్చిబౌలి: విద్యుదాఘాతానికి గురై ఓ వాచ్‌మెన్ మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కాకినాడకు చెందిన సత్తనపల్లి వీరబాబు(30) కొండాపూర్ హెచ్‌ఏఎల్ కాలనీలో వంశీ అనే వ్యక్తికి చెందిన నిర్మాణ భవనంలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం 6.30 గంటలకు లైట్లు ఆఫ్ చేస్తుండగా వైర్ తగలడంతో కిందపడిపోయాడు. వెంటనే కూలీల సహాయంతో భార్య భవానీ కొండాపూర్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అప్పటికే వీరబాబు మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. ఉస్మానియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పటాన్‌చెరు ఎంఈఓగా నాగేశ్వరరావు నాయక్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎంఈఓగా నాగేశ్వరరావు నాయక్ నియమితులయ్యారు. పటాన్‌చెరు ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న పీపీ రాథోడ్ బదిలీపై రామచంద్రాపురానికి వెళ్లడంతో ఆయన స్థానంలో ఘనపూర్ నుంచి వచ్చిన నాగేశ్వరరావు నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

హెచ్‌సీయూలో ముగిసిన ఒగ్గుకథ, వర్క్‌షాప్



రాయదుర్గం: తెలంగాణ జానపద కళారూపాలలో ప్రఖ్యాతిగాంచిన ఒగ్గుకథ, వర్క్‌షాప్ హెచ్‌సీయూలో మంగళవారం ముగిసింది. హెచ్‌సీయూ సాంస్కృతిక కేంద్రం అధిపతి డాక్టర్ పుదుచ్చేరి ఆధ్వర్యంలో హెచ్‌సీయూ జానపద సాంస్కృతిక అధ్యయన కేంద్రం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ సంయుక్తంగా ఒగ్గుకథ ప్రదర్శన, వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఒగ్గు కథలోని కొన్ని ఘట్టాలైన ఎల్లమ్మ పరశురాముని మధ్య సంవాదం, మల్లన్న కల్యాణం , గొల్లకేతమ్మ మేడలమ్మ సమతులవాదం ప్రదర్శించారు. అలాగే ఒగ్గు, ఢమరుకం, డోలు, తాళం, పిల్లనగ్రోవి తదితర వాయిద్యాలతో ఒగ్గు కథ కళాబృందం అందరినీ ఆకట్టుకుంది. ప్రొఫెసర్ సాంబశివరావు, నిజిల్, వసుమతి, ధనలక్ష్మీ, మల్లేశ్వరి, లక్ష్మణ్ కళాకారులు ఓదయ్య, రాజమల్లు, రాయమల్లు, చంద్రయ్య, భూములు, హరీష్, స్వామి శివరామ్, సూర్య, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్‌లో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ ఎం.రవికుమార్‌యాదవ్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్ గౌడ్, ఎల్లేష్, అరుణ్‌కుమార్, మహిపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కృష్ణంరాజు, రమేష్, వెంకట్, మల్లికార్జున్‌రెడ్డి, శాంతిభూషణ్‌రెడ్డి, మల్లేష్, శేషయ్య, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భెల్ ఎంఐజీ కాలనీలో..

భెల్ ఎంఐజీ కాలనీలో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, నాయకులు రేణుక, రత్న, విజయ్‌రాజ్, శ్రీనివాస్, జగదీష్‌కుమార్, గోపి, శ్రీనివాస్‌చారీ, రఘురాం, ప్రవీణ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో..

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్ నగర్‌లో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణ్ కుమార్, మహిపాల్ రెడ్డి, బుచ్చిరెడ్డి, రామ్‌రెడ్డి, వీరాచారి, సునీల్‌రెడ్డి, కృష్ణంరాజు, రమేష్ పాల్గొన్నారు.


దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు


తారానగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎం.రవికుమార్‌యాదవ్


భెల్ ఎంఐజీ కాలనీలో .. బీజేపీ నాయకులు మహిపాల్‌రెడ్డి తదితరులు

హెచ్‌సీయూలో డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు


పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీసేవ పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఎస్ఎన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్‌లో విద్యార్థులకు పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య పర్యవేక్షణలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ హెడ్ ప్రొఫెసర్ బీవీ సురేష్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కీర్తన తంగవేలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం కృష్ణయ్య మాట్లాడుతూ మహాత్మాగాంధీ జయంతి రోజున విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీంసింగ్, తెలుగు విభాగానికి చెందిన డాక్టర్ భాశెట్టిలత, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఐఐఎం లక్నో-టాలెంట్ స్ప్రింట్ ఆధ్వర్యంలో కొత్త కోర్సు

సేల్స్, మార్కెటింగ్‌లో ఎగ్జిక్యూటివ్ కోర్సు ప్రారంభం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని టాలెంట్‌స్ప్రింట్–ఐఐఎం లక్నో కలిసి సేల్స్, మార్కెటింగ్‌లో ఎగ్జిక్యూటివ్ కోర్సును బుధవారం ప్రారంభించారు. ఆధునిక వ్యూహాలతో ప్రొఫెషనల్స్‌ను శక్తివంతం చేయడమే లక్ష్యంగా సాగుతున్నారు. ఈ సందర్భంగా ఐఐఎం లక్నో మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ చైర్మన్ ప్రొఫెసర్ సబ్యసాచిసిన్హా మాట్లాడుతూ ఎగ్జిక్యూటివ్‌లకు అనుకూలంగా వీకెండ్ క్లాసులు ఉంటాయన్నారు. టాలెంట్ స్ప్రింట్ వ్యవస్థాపక సీఈఓ ఎండీ డాక్టర్ శంతనుపాల్ మాట్లాడుతూ ఈ కోర్సు సేల్స్, మార్కెటింగ్‌లో డిజిటల్ పరిసరాలను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో సహాయపడుతుందన్నారు. ఐఐఎం లక్నో క్యాంపస్‌ను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు అవకాశం ఉంటుందన్నారు.కోర్సు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు ఉపాధి అవకాశాలు

వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి


శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ కార్యాలయంలో సమావేశమైన జెడ్సీ ఉపేందర్‌రెడ్డి, అధికారులు

గచ్చిబౌలి: ఇందిరా మహిళా శక్తి స్కీమ్‌లో భాగంగా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ సర్కిల్ ప్రాజెక్టు అధికారులు, ఇతర అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలో ప్రధాన కూడళ్ల, పార్కుల వద్ద క్యాంటిన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళా శక్తి పాలసీ పేరుతో మహిళా పారిశ్రామికవేత్తలకు సాధికారత కల్పించడానికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి, వెస్ట్‌జోన్ పరిధిలోని ప్రాజెక్టు అధికారులు, డిప్యూటీ కమిషనర్లు, ఆర్థిక సలహాదారు సుధాకర్, ఎగ్జామినరల్ ఆఫ్ అకౌంట్స్ విజయ కుమార్, మెడికల్ ఆఫీసర్ సాల్మన్ సర్కిల్– 19 యూసుఫ్‌గూడ, అధికారులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

గిరిజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తుకారాం నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న తుకారాం నాయక్

మియాపూర్: తెలంగాణ మైదాన ప్రాంత గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం స్థానిక ఎంఏనగర్ కార్యాలయంలో మాలవత్ జబ్బార్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కన్వీనర్ తుకారాం నాయక్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మండిపడ్డారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో తండాలను మేజర్ గ్రామ పంచాయతీలుగా చేయలేకపోయారన్నారు.ఇప్పటికీ తండా గ్రామ పంచాయతీలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. వాటికి సొంత భవనాలు నిర్మించాలని అన్నారు. 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివరాంనాయక్, గోపాల్ నాయక్, ప్రకాష్ నాయక్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం


ప్రదర్శనలోని స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి అన్నారు. బుధవారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ విద్యాభారతి పాఠశాలలో సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహిస్తున్న వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రదర్శనల వలన విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీసినవారమవుతామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.